అనుదినం జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శనివారం 12 ఆగస్టు 2023

## కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడ్డ వ్యక్తిపై అట్రాసిటీ కేసు

నవతెలంగాణ-కోటపల్లి

షెట్‌పల్లిలో దళిత రైతు దుర్గం బాపును కులం పేరుతో దూషించి దాడి చేసిన సూరం రాంరెడ్డిపై శుక్రవారం కేసు నమోదు చేశామని కోటపల్లి పోలీసులు తెలిపారు. ఈ మేరకు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఒక ప్రకటన విడుదల చేశారు. జైపూర్ ఏసీపి మోహన్ గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. నేరం నిరూపణ అయినందున నిందితునిపై అట్రాసిటి కేసు నమోదు చేశారు. జ్యూడిషల్ రిమాండ్‌కు తరలించారు. ప్రతి నెల 30న ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామంలలో 'సివిల్ రైట్స్ డే' నిర్వహించి ప్రజలకు కుల వివక్ష చట్టలపై అవగాహన కల్పించాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.

## పదోన్నతి పొందిన కలెక్టరేట్ ఏఓకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కలెక్టరేట్ ఏవోగా పనిచేసి తహసీల్దార్‌గా పదోన్నతి పొందిన రఫత్ హుస్సేన్‌కు టీఎన్జీవో సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎన్జీవో సంఘ అభివృద్ధికి జిల్లాలో రఫత్ హుస్సేన్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ లింగాల రాజశేఖర్, గౌరవ అధ్యక్షులు సిడం పోచయ్య, సభ్యులు కుమార్ వసంత్, మధుకర్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా పనిచేయాలి



నవతెలంగాణ - కౌటాల

గ్రామాల్లో కార్యదర్శులు బాధ్యతాయుతంగా పని చేయాలని డీఆర్‌డీఓ సురేందర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైస్ ఎంపీపీ నికోడె అమ్మక్క ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 2021 నుండి మార్చి 2023 వరకు ఉపాధిహామీ ద్వారా నిర్వహించిన రూ.20.28 కోట్ల పనులకు సంబంధించిన వివరాలను సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ ద్వారా పనులు నిర్వహిస్తే కొలతల తేడాలు, వంద రోజులకు గాను ఎక్కువ రోజులు చేసినట్టు తేలడం బహిర్గతమయ్యాయి. ఏప గ్రామాల్లో తనిఖీల్లో బయటపడిన నిధులను తిరిగి ప్రభుత్వానికి వచ్చేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యదర్శులు గ్రామస్థాయిలో బాధ్యతాయుతంగా పనులు చేపట్టాలని, వీరికి సర్పంచ్‌లు సహకరించాలని పేర్కొన్నారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో జిల్లా అండర్స్‌మెన్స్ సాయిశ్రీ, డీఆర్‌పీ కొమురయ్య, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, ఏపీఓ పూర్ణిమ, ఐకేపీ ఏపీఎం వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, కూలీలు పాల్గొన్నారు.

## అంగన్వాడీలను ఎండీప సర్వే నుండి మినహాయించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్వాడీ టీచర్లను ఎండీప సర్వే నుండి మినహాయించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.వనిత డిమాండ్ చేశారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని సావిత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా కొనసాగుతున్నాయని, జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 10 నుండి 25వ తేదీ వరకు ఎంప ఎండిప సర్వే చేయాలని టీచర్లపై అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారని, అనారోగ్య సమస్యలు ఉన్నవారిని కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మెడికల్ విభాగానికి సంబంధించిన పనిని చేయించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా శాఖాపరమైన పనులు తప్ప ఇతర పనులు ఏవీ అప్పగించకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకురాలు సువర్ణ పాల్గొన్నారు.

## మామను హత్య చేసిన అల్లుడు

నవతెలంగాణ - పెంచికల్‌పేట్



మండలంలోని లోడ్‌పెల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం మామపై అల్లుడు దాడిచేసిన ఘటనలో మామ పోతురాజుల భీమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని లోడ్‌పెల్లి గ్రామానికి చెందిన పోతురాజుల భీమయ్య(52)ను అల్లుడు సేగం తిరుపతి, మేనల్లుడు బుర్స మల్లేష్ రూ.3వేలు అప్పుగా ఇవ్వమని అడిగారు. నిరాకరించిన మామపై మొదట కట్టెతో దాడిచేసి సిమెంటు రోడ్డుపై ఎత్తివేసి పడేయడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో భీమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పోతురాజుల రాజక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

నవతెలంగాణ - రెబ్బెన

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్నట్టు ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును మండలానికి చెందిన లబ్దిదారుడు అనుబాయికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ప్యాక్స్ చైర్మన్ కార్నాదం సంజీవ్‌కుమార్, నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## రేపు సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ - కౌటాల

మండల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై సమాశాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఒక్క రోజు ముందుగానే అధికారులు వారి నివేదికలను అందజేయాలని తెలిపారు.

# ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్థికంగా ఎదగాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

వెనుకబడిన తరగతుల కులవృత్తుల వారికి ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సహాయ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, ఎమ్మెల్యే దివాకరావుతో కలిసి వెనుకబడిన తరగతుల కులవృత్తుల ఆర్థిక సహాయ పథకం లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల కులవృత్తుల వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 14 రకాల కులవృత్తులు చేసుకునే జీవించే వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 2668 మంది అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయగా ప్రస్తుతం మొదటి విడతగా నియోజకవర్గానికి 300 మంది లబ్దిదారుల చొప్పున జిల్లాలోని 3అసెంబ్లీ నియోజకవర్గాలలో 900 మంది లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మిగిలిన వారికి విడతల వారీగా అందిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, ఇందులో భాగంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయ పథకం ద్వారా వెనుకబడిన తరగతుల కులవృత్తులను ప్రోత్సహిస్తూ వృత్తిదారులకు ఆర్థికంగా చేయూత అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హత గల మైనార్టీలకు అందించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా 19వేల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేయడం జరిగిందని, రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబంలో ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున ప్రతి నెల బియ్యం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ కమిషనర్లు మారుతి ప్రసాద్, రమేష్, మున్సిపల్ చైర్మన్లు పెంట రాజయ్య, ఈసంపల్లి ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# కోటపల్లి ఘటనపై దళిత సంఘాల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

షెట్‌పల్లి గ్రామంలో గురువారం దళిత రైతు దుర్గం బాపును గుంజకు కట్టేసి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వివిధ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అగ్రకుల అహంకారంతో దళిత రైతును కట్టేసి కొట్టడం దారుణమన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్ సుమోటాగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు చాపిడి సురేష్, ఆసిఫాబాద్ సెంటర్ కమిటీ జాడి బాపు, మాజీ సెంటర్ కమిటీ అధ్యక్షుడు మౌల్కర్ అశోక్, దుర్గం తిరుపతి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, నాయకులు జాడి అశోక్, జాడి వినోద్ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి టీకానంద్, చాపిడి ప్రసాద్, దుర్గం దయానంద్, దుర్గం ఆకాష్ పాల్గొన్నారు.

**జైపూర్**: దళిత వర్గానికి చెందిన దుర్గం బాపుపై దాడి చేసిన రాంరెడ్డిని వెంటనే శిక్షించాలని నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏస్కూరి రాజమల్లు, జిల్లా అధ్యక్షులు పొట్టాల నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అదే విధంగా రామిల్ల రాధిక సైతం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దళిత వ్యక్తి బాపును రాంరెడ్డి కట్టేసి కొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఉండి కూడా దళితులపై దాడులను అడ్డుకోకపోవడం దళిత జాతికి అవమానకరమని పేర్కొన్నారు. అనంతరం ఆమె మండలంలోని వివిధ గ్రామాలలో సుడిగాలి పర్యటన చేసి వరి నాట్లు వేస్తున్న మహిళలతో మాట్లాడారు. ఆమె వెంట మండల నాయకులు గంగాధరి రాజయ్య ఉన్నారు.

# రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మానవహారం




నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రెండవ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏఎన్ఎంల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఇది ఇప్పటివరకు పని చేస్తున్న వారికి గుదిబండగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలను ఫణంగా పెట్టి రెండవ ఏఎన్ఎంలు కరోనా సమయంలో కూడా విధులు నిర్వర్తించారని అన్నారు. గతంలో రోస్టర్ విధానంలో పరీక్ష రాసి రెండవ ఏఎన్ఎంల నియామకం చేపట్టారని, మళ్లీ వారిని పరీక్ష రాయమనడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలని, పాతవారికి వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే 16 నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు దివాకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, పిడుగు శంకర్, ఏఐవైఎఫ్ చిరంజీవి, సంఘం జిల్లా అధ్యక్షురాలు సంతోషి, జిల్లా కార్యదర్శి పుణ్యవతి, ప్రచార కార్యదర్శి భాగ్య, ప్రమీల, భూదేవి, సునీత, కోశాధికారి వసంత, పద్మ, కవి పాల్గొన్నారు.

**హాజీపూర్ :** కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏఎన్ఎంల సేవలు చాలా ముఖ్యమైనవన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం వారిని గుర్తుంచకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలన్నారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిన వివిధ రకాల ఏఎన్ఎంలు కొన్ని ఏళ్ళ గా పని చేస్తున్నారన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వడమెందుకని ప్రశ్నించారు. ఆ నోటిఫికేషన్ రద్దు చేసి అందరిని పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వం న్యాయం చేయకపోతే 15 నుండి సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల, ఆదిలక్ష్మి, సరోజ, సత్యవతి, రజిత, వినోద, త్రివేణి, రమ, జ్యోతిర్మాయి పాల్గొన్నారు.

## ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించాలి : ఆర్‌ఎం సొలేమాన్

**ఆసిఫాబాద్ :** ప్రయాణికులకు ప్రతి విషయంలో నాణ్యమైన సేవలు అందించాలని ఆర్‌ఎం సొలేమాన్ ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటిసారిగా ఆసిఫాబాద్ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపో పరిధిలోని దుకాణాలు మరుగుదొడ్లు ఇతర వసతులు తనిఖీ చేసి పుస్తకాలు డిపో పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం గొప్ప పరిణామన్నారు. దీంతో మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. ఇదే సందర్భంలో మరిన్ని నాణ్యమైన సేవలు ప్రయాణికులకు అందించడానికి కృషి చేయాలని తెలిపారు. రానున్న రోజుల్లో ఆర్టీసీకి మరింత ఆదాయం తీసుకురావడానికి సిబ్బంది క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## బోదకాల వ్యాధి నివారణకు ఎండీప మాత్రలు తీసుకోవాలి

**రెబ్బెన:** బోదకాల వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ తప్పకుండా ఎండీప మాత్రలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. బోదకాల వ్యాధి నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలు మింగే కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను కూడా మాత్రలు తీసుకున్నానన్నారు. జిల్లాలో బోదకాల వ్యాధి నిర్మూలనకు అందించే ఎండీప మాత్రలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వేసుకొనే విధంగా వైద్యాధికారులు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా మాత్రలు తీసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుజిత్, హెచ్ఈఓ రసీద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీన్, అంగన్‌వాడీలు, వైద్యసిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి స్థాయి వివరాలతో సిద్ధంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్



నవతెలంగాణ-నస్పూర్

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామాలలో చేపట్టిన కార్యక్రమాల పరిశీలించేందుకు కేంద్ర కమిటీ సభ్యులు జిల్లాకు రావడం జరిగిందని, గ్రామాలలోని క్షేత్ర స్థాయి సిబ్బంది వారి పరిధిలో చేపట్టిన కార్యక్రమాల పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్ అన్నారు. శుక్రవారం కేంద్ర కమిటీ సభ్యులు నస్పూర్‌లోని సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలో కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం అదనపు కలెక్టర్ చాంబర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 310 గ్రామపంచాయతీలలో చేపట్టిన కార్యక్రమాలను కేంద్ర కమిటీ సభ్యులు పర్యవేక్షించడం జరుగుతుందని, ఈ క్రమంలో శుక్రవారం భీమారం మండలంలోని పోలంపల్లి, ఖాజీపల్లి, బెల్లంపల్లి మండలంలోని బూదకలాన్, పెల్లి గ్రామపంచాయతీలను సందర్శించారని తెలిపారు. జిల్లాలోని గ్రామాల క్షేత్రస్థాయి సిబ్బంది వారి కార్యాచరణను పూర్తి చేసుకుని అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ బి.శేషాద్రి, డీపీఓ డి. వెంకటేశ్వర్రావు, బెల్లంపల్లి డీఎల్‌పీఓ ఎ.ఫణిందర్, మండల పంచాయతీ అధికారులు, ఎస్‌బిఎం జిల్లా కో-ఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ - హాజీపూర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా కేసీఆర్ సర్కార్ పని చేస్తుందని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. శుక్రవారం దొనబండ గ్రామంలోని ఎస్సీ కాలనిలో నివస్తున్న 50 మంది దళిత కుటుంబాలకు శుక్రవారం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పట్టాదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన అన్ని వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. దొనబండ ఎస్సీ కాలనీలో నివసిస్తున్న దళితులు చెరువు దగ్గర ఉండటంతో చాలా సంవత్సరాల నుంచి ఇబ్బందులు పడుతున్నారని, అది గమనించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పట్టాలు పంపిణి చేసినట్లు పేర్కొన్నారు. మరి కొంత మందికి ఇండ్ల పట్టాలు రాలేదని, వారికి కూడా త్వరలోనే సర్వే జరిపించి పట్టాలు అందిస్తామని తెలిపారు. గ్రామస్తులందరూ ఐక్యమంతంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బెతు రమాదేవి- రవి, డిప్యూటీ తహసీల్దార్ హరిత, సర్పంచ్ జాడి సత్యం, ఉప సర్పంచ్ అనూహ్య - రాకేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు గోళ్ళ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మెన్ కోటే సత్తయ్య, సర్పంచులు కొట్టే మహేందర్, మంచాల శ్రీనివాస్, అన్నం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమ దందాలపై చర్యలు తప్పవు




నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలో అక్రమ దందాపై చట్టపరమైన చర్యలు తప్పవని టౌన్ ఎస్‌హెచ్ఓ బుద్దే స్వామి హెచ్చరించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం టౌన్ ఎస్సై కళ్యాణ్ తన సిబ్బందితో కలిసి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రైల్వేస్టేషన్ రోడ్డులో రెండు స్కూటీల్లో చంద్రపూర్‌కు చెందిన అజయ్ కుమార్, రోహిత్, కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన విశాల్, ఆకాష్ అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని విచారించగా మహారాష్ట్ర నుండి అక్రమంగా దేశీదారు మద్యం సీసాలను తీసుకుని వస్తున్నారు. వీరివద్ద నుంచి 1150 దేశీదారు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న దేశీదారు మద్యం సీసాల విలువ సుమారు రూ.40,250 ఉంటుంది. టౌన్ ఎస్సై చంద్ర శేఖర్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్‌హెచ్ఓ బుద్దే స్వామి మాట్లాడుతూ ప్రజలు నాటుసారా, గుడుంబా, దేశీదారు మద్యం, గంజాయి ఇతరత్రా మత్తుపానీయాలు సేవించవద్దని సూచించారు. వీటిని అమ్మినా, తయారు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు కళ్యాణ్, చంద్రశేఖర్, పీసీలు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరికలు

నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని తుంగెడ, మాధవాయిగూడ బీఆర్ఎస్ వార్డుమెంబర్, గ్రామపటేళ్లు తులసీరాం, శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆజ్మీర ఆత్మారాం నాయక్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. వారికి ఆజ్మీర ఆత్మారాం నాయక్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ భారత ప్రధానీ నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన అనేక సంక్షమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ పాలనను తరిమికొట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి చేకూరి నవీన్‌గౌడ్, యువకులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
శనివారం 12 ఆగస్టు 2023


## బాధిత కుటుంబానికి పరామర్శ
నవతెలంగాణ-కుభీర్



మండలంలోని సొనారి గ్రామానికి చెందిన క్యాసోళ్ల హన్మక్క ఇటీవల గుండె పోటుతో మరణించడంతో శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవర్ రామారావు పటేల్ బాధిత కుటుంబ సభ్యులైన కె.నడిపి సాయన్న, చిన్న సాయన్నలను పరామర్శించారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారిని అన్ని విధాలుగా అందుబాటులో ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నగేష్, దత్తురాం పటేల్, సందీప్ పాటిల్, సాయినాథ్, విఠల్, ముత్యం పటేల్, గంగాధర్, నాగేందర్, చిరంజీవి, చికిలి రాజన్న పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన అధ్యాపకులు
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రామ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.. మొక్కల నాటాలని, ఆ మొక్కలను సంరక్షించే బాధ్యత మన అందరిపైన ఉందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఘునాథ్, సంతోష్, డా.నర్సింగరావు, శ్రీనివాస్ దయాకర్, విజయ్, జ్ఞానేశ్వర్, రాజ్ కుమార్, జోత్స్న ఉన్నారు.

## రైతులకు అండగా రైతుబీమా
- మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల పీరాజి



నవతెలంగాణ-కుభీర్

రైతులకు అండగా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతుబీమాను అమలు చేస్తోందని మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల పీరాజి అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన పాషామియా రైతు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నామిని పాషామియా రైతు భార్య మెహర్ ఉనిస నుంచి రైతుబీమా పత్రాలు సేకరించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మీరా విజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద రైతులకు అండగా ఉండేందుకే రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందించేందుకు ఎంతో కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహియోద్దీన్ వ్యవసాయ విస్తీరణ అధికారి రమేష్, రైతులు సాయినాథ్, జావిద్, మహమ్మద్ గ్రామస్తులు ఉన్నారు.

## డోంగర్‌గావ్‌లో వైద్యశిబిరం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పిట్టబొంగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డోంగర్‌గావ్‌లో వైద్యశిబిరాన్ని ఆదివాసీ గిరిజన సంఘం వినతి మెరకు శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇటీవల ఆ గ్రామంలో కంటి చూపు సమస్యలు తలెత్తడంతో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఊయిక విష్ణు, మండల అధ్యక్షులు. పెందోర్ కృష్ణ స్థానిక వైద్యుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వైద్యులు ప్రతాప్ నాయక్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. సందర్భంగా మొత్తం 32 ఓపీలను పరీక్షించి, వైద్యం అందించారు. ముగ్గురు క్యాటరాక్ట్‌తో బాధపడుతున్న వారికి రిమ్స్‌కు రేఫర్ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో ఆప్తాల్మిక్ వైద్యులు భాస్కర్ రావ్, సిబ్బంది గంగాబాయి, నిర్మల, శివ రాణి పాల్గొన్నారు.

## పోస్టాఫీస్ భవన నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-బోథ్

పోస్టాఫీస్ నూతన భవన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ సురేందర్ యాదవ్, సూపరింటెండెంట్ ఎస్.అనిల్ కుమార్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పోస్టాఫీస్‌కు సొంత స్థలం ఉన్నప్పటికి అద్దె భవనంలో కొనసాగుతుందని అన్నారు. సొంత స్థలంలో మిని పోస్టాఫీస్ భవన నిర్మాణానికి రూ.30లక్షలు నిధులు మంజూరు కావడంతో ఆ స్థలంలో భవన నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీని పట్ల బోథ్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు కట్ట భూమేష్, పసుల చంటి, గుడాల శేఖర్, సుమెర్ పాషా, మహ్మద్, అబుద్, జేసీపీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ
నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఆరె విఠల్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## తహసీల్దార్ పవనచంద్రకు సత్కారం
నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ పవనచంద్రను, పదోన్నతి పొందిన డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌ను సర్పంచ్ లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ రామారావు, మాజీ ఎంపీటీసీ బాలరాజ్‌గౌడ్, భైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, నర్సురి నరేష్‌రావు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం
నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల్, లక్ష్మణచాంద, పార్‌పల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మత్తు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 8:30 గంటల నుండి 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## పదవికి రాజీనామా
నవతెలంగాణ-తాంసి

అనారోగ్యం కారణంగా కాంగ్రెస్ భీంపూర్ మండల కన్వీనర్ పదవికి రాజీనామా చేసినట్లు జలిగిరి మల్లేష్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో గత ఎన్నో సంవత్సరాలుగా ఒక కార్యకర్తగా ఉన్నను నాపై నమ్మకంతో గత సంవత్సరంలో భీంపూర్ మండల కన్వీనర్‌గా నియమించారు. కానీ అనారోగ్యం కారణంగా పార్టీకి తగిన న్యాయం చేయలేక పోతున్నానని అన్నారు. అంతే కానీ పార్టీపై నాయకులపై మనస్పర్థలు లేవని అన్నారు. ఇకముందు కూడా పార్టీలోనే కొనసాగుతానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేస్తానని అన్నారు. నా రాజీనామాను ఆమోదించాలని కోరారు. రాజీనామాను మాజీ కన్వీనర్ రమేష్‌కు అందజేశారు.

### ప్రజల సౌకర్యార్థం
# సమీకృత మార్కెట్ కాంప్లెక్స్
- స్థలం పరిశీలించిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో సమీకృత మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిదులు, అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాత రెవెన్యూ కార్యాలయం, ఆర్ అండ్ బీ ప్రాంగణంలో మూడు ఎకరాల 10 గుంటల స్థలం ఉండగా, రెండు ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీతో పాటు కార్పొరేషన్లలో సకల హంగులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లా కేంద్రంలో అత్యాధునిక వసతులతో సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ సముదాయ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేసేందుకు మున్సిపల్ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందని వెల్లడించారు. పనులు పూర్తయితే ఇక కూరగాయలు, మాంసం, పూలు, అన్ని వస్తువులు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. వినియోగదారులు ఒక్కసారి మార్కెట్‌కు వెళ్లితే అన్ని సరుకులు ఒకే చోట కొనుగోలు చేసేలా కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి ఇప్పటికే శంఖుస్థాపన చేశామని అన్నారు. ఇది అందుబాటులోకి వస్తే పండ్ల విక్రయదారుల షాపులన్ని అక్కడి తరలిపోతే అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ త్వరలోనే నిర్మల్ జిల్లా కేంద్రానికి రానున్నారని తెలిపారు. కోట్లాది రూపాయాలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. రాబోవు రోజుల్లో ప్రజలకు మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వేర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి
- నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-బాసర

తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి కలెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల స్థితిగతులు తెలిసిన తల్లిదండ్రులు వారి ఉన్నతికి తోడుగా ఉండాలని, వారు ఏ రంగాలలో ప్రావీణ్యులై ఉంటే ఆ రంగాలలో రాణించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. చదువుతోపాటు క్రీడలు ఇతర వ్యాపాకాలపై దృష్టి ఉంటే ఆ రంగాలలోనే విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. బిడ్డలు ఎదిగితే తల్లిదండ్రులకు సంబురంగా ఉంటుందని, అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు విద్యార్థి ఇష్టపడి చదవాలని అన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు సమస్య ఉంటే తన దృష్టికి లేదా అధ్యాపకులు, డైరెక్టర్, తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. సమస్యకు పరిష్కారం ఉంటుందని సమస్యను చదువుతో దూరం చేసి తల్లిదండ్రులు మీ పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయొద్దని అన్నారు. విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు వైద్య సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని తమ సమస్యలను వారితో చర్చించి వరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**యూనివర్సిటీ అధ్యాపకులతో కలెక్టర్, వీసీ సమావేశం**

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ వివిధ విభాగాల అధ్యాపకులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ సమావేశమయ్యారు. యూనివర్సిటీ అభివృద్ధికి ముందడుగు వేసేందుకు అధ్యాపకులే ముఖ్యపాత్ర వహిస్తారని, అందుకు తగ్గట్లు విద్యార్థులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ఒక్కో అధ్యాపకుడు సుమారు వందమంది విద్యార్థులతో సఖ్యతగా ఉంటూ అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. యోగ తరగతులు, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల వైపు విద్యార్థులు మొగ్గు చూపేలా చూడాలని అన్నారు. వీటితో పాటు విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మెస్‌లో పౌష్టికారమైన భోజనం అందేలా చూడాలని అన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు గూర్చి వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# నీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- కడెం ప్రాజెక్టుపై సీఎంకు అవగాహన లేకపోవడం విడ్డూరం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

రాష్ట్రప్రభుత్వం పాత సాగునీటి ప్రాజెక్టుల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఖానాపూర్ వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6 ఏండ్ల కింద మంత్రి హరీశ్‌రావ్ ప్రారంభించిన సదర్‌మాట్ బ్యారేజ్ నిర్మాణం ఇంతవరకు పూర్తి చేయక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ఖానాపూర్, కడెం ప్రాంత రైతులకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా పాత సదర్‌మాట్ ఆనకట్ట వరకు ప్రత్యేక కెనాల్ నిర్మిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నీటి మూటలే అయ్యాయని అన్నారు. కెనాల్‌కు తరుచుగా గండ్లుపడి రైతాంగం నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో రెండు పంటలు పండించుకునే ఆయకట్టు రైతాంగం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పుడు ఒక్క పంటకూడా పండించుకోవడం లేదన్నారు. మొన్న కురిసిన వర్షాలకు కాలువకు పడ్డ గండ్ల మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయని కారణంగా రైతులు ఖరీఫ్ పంట నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వరమే గండ్లు పూడ్చి ఆయకట్టుకు నీరందించాలని డిమాండ్ చేశారు. కడెం ప్రాజెక్టు 18 గేట్లు ఉంటే అందులో 6 గేట్లు పనిచేయని పరిస్థితి ఉందన్నారు. ప్రాజెక్టుకు అదనంగా గేట్లను పెంచాలని అన్నారు. కడెంకు వరద వచ్చి భయానక పరిస్థితి ఎదురైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వహించడం సరికాదన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రాజెక్టులపై అంతగా అవగాహన లేనట్టుందని ఎద్దేవా చేశారు. ఎగువన కుప్టి వద్ద జలాశయం నిర్మిస్తే కడెం ప్రాజెక్టుకు వరద తాకిడి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఖానాపూర్ పట్టణంలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెడ్మ బొజ్జు, దయానంద్, చారులత, చిన్నం సత్యం, యూసుఫ్ ఖాన్, కిషోర్ నాయక్, షబ్బీర్ పాషా, తోట సత్యం, నిమ్మల రమేష్, జహీర్, మడిగెల గంగాధర్ ఉన్నారు.

## రెవెన్యూ మండలం సాధించేంతవరకూ ఉద్యమం
నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని గత 26 రోజుల నుంచి చేపడుతున్న రెవెన్యూ డివిజన్ సాధన సమితి చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు మద్దతుగా టీపీసీసీ సభ్యుడు డాక్టర్ వన్నెల అశోక్ శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని నుంచి తరలిపోయిన కార్యాలయాలు వెంటనే మండల కేంద్రానికి తరలి వచ్చేంతవరకు తమ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుల చంటి, ఇంద్రారెడ్డి, ఎడమల రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బద్దం సాయి, కిరణ్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సామ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీని ముట్టడించిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు
నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ విద్యార్థి జాదవ్ బబ్లూ మృతికి నిరసనగా శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఆర్జీయూకేటీ యూనివర్సిటీ ప్రధాన ద్వారాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులను పోలీసులు ఆర్జీయూకేటీ సెక్యూరిటీ అడ్డుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యూనివర్సిటీలోని విద్యార్థుల మృతిపై సీఎం కేసీఆర్ స్పందించాలని అన్నారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, వీసీ వెంకటరమణ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ సయ్యద్ హైదర్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు సురేష్‌బాబు పాల్గొన్నారు.

## పేదలను అభివృద్ధి చేయడమే లక్ష్యం
- కిరణ్ ఫౌండేషన్ చైర్మెన్



నవతెలంగాణ-భైంసా

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని డాక్టర్ కిరణ్ ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బెల్ తరోడ గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి వారి కష్టా సుఖాలను అడిగి తెలుసుకున్నారు. తాను సేవా కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో చెరువయ్యానని అన్నారు. ఇంకా ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వస్తున్నానని తెలిపారు. పల్లెల్లో పేదోడ అన్న మాటే ఉండకూడదని అన్నారు. అందరూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్నానని, ప్రజల ఆశీర్వాదం ఇవ్వాలని అన్నారు. ప్రజలు తనకు అవకాశమిచ్చి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మీయ సమ్మేళనానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఇందులో సర్పంచ్ సాయినాథ్, గంగాధర్, కోలూర్ రాములు, పండిత్ పటేల్, దేవిదాస్, ధర్మన్న, తానూర్‌రెడ్డి, భోజరాం, నాగేష్, మహేష్ పాల్గొన్నారు.

## అవకతవకలు లేకుండా ఓటరుజాబితా తయారు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎలాంటి అవకతవకలు లేకుండా నిష్పక్షపాతంగా ఓటరు జాబితాను తయారు చేయాలని డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశా మందిరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు బీఎల్ఎస్‌ఏ-1 ఫామ్ పార్టీ అధికారిక ఏజెంట్ల లిస్టును పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కొంతమంది రాజకీయ నాయకులు కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్న ఓటర్లను తొలగించే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. అనంతరం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డిని కలిసి వాహనదారులను ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. సరియైన వాహనాలకు సంబంధించిన పత్రాలు ఉన్న వాహనదారులను పోలీసులు ఇబ్బంది పెట్టొద్దని అన్నారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాదారులు సైతం వాహన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించవద్దని సూచించారు.

## పీఆర్టీయూ సభ్యత్వాల నమోదు ప్రక్రియ ప్రారంభం
నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పీఆర్టీయూ సభ్యత్వాల నమోదు చేసే కార్యక్రమాన్ని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి.రమణారావు శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయుల వద్ద పీఆర్టీయూ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా బి.వి.రమణారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు. అతిపెద్ద సంఘంగా మన పీఆర్టీయూ నిలిచిందని తెలిపారు.

## నేడు బహుజన సాహితీవేత్త సంస్మరణ సభ
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రముఖ విద్యావేత్త, బహుజన సాహితీవేత్త, మహాత్మ జ్యోతిబా పూలే దంపతులపై అనేక అధ్యయనాలు చేసి వందలాది పుస్తకాలు రాసి పూణే యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, సమతా పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఉన్న ప్రొఫెసర్ హరి నరకే సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుకుమార్ పెట్కూలే, సాంబన శేండే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

## పంటపై గడ్డిమందు పిచికారి చేసిన దుండగులు
నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని పొట్పల్లి(ఎం) గ్రామానికి చెందిన మాదవ్ గంగన్న పంటకు గురువారం ఎవరో గుర్తుతెలియని దుండగులు గడ్డిమందు పిచికారీ చేశారు. సోయా, పత్తి పంటలు గడ్డిమందు ప్రభావంతో పూర్తిగా ఎండిపోతున్నట్లు రైతు వాపోయాడు. తనపై కక్ష కట్టిన వారెవరో కావాలనే పంటపై గడ్డిమందు పిచికారీ చేసి పంట నాశనానికి కారణమయ్యారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై సాయికుమార్ పంటలను పరిశీలించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
శనివారం 12 ఆగస్టు 2023

## ఆప్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నయీం పాషా

నవతెలంగాణ-నస్పూర్

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన నయీం పాషా నియమితులయ్యారు. మంచిర్యాల నియోజకవర్గ కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నయీం పాషా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ మెంబర్ మాజీద్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ మలెం మధు, యువజన విభాగం అధ్యక్షుడు రన్‌దీర్‌సింగ్ రాణా, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు సురేష్ బాబు, రాష్ట్ర స్పోక్ పర్సన్ పరీక్ష రాజ్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ నల్ల నాగేంద్ర ప్రసాద్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజేందర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన ప్రెస్‌క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



నూతనంగా మందమర్రి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.చంద్రశేఖర్‌ను శుక్రవారం క్యాతనపల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన ఆదిలాబాద్ నుండి మందమర్రికి బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కలువల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిల్ల శ్రీనివాస్, కోశాధికారి పనికిపంఢ్ల రాజు, ఉపాధ్యక్షులు తూముల భవిష్యత్, సంయుక్త కార్యదర్శి పోలుదాసరి శ్రీనివాస్, క్లబ్ ఇన్‌చార్జి చొప్పదండి జనార్ధన్, సభ్యులు రాణవేన రాకేష్ పాల్గొన్నారు.

## సీఆర్టీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



నవతెలంగాణ - హాజీపూర్

ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని టీ ఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వేతనాలు వెంటనే చెలించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోళ్ల రామన్న, గుర్రాల రాజావేణు మాట్లాడుతూ నెలల కొద్ది జీతాలు పెండింగ్‌లో ఉండటం వల్ల సీఆర్టీల కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. వారికి ఏ నెల జీతం అదే నెల చెల్లించి ఆదుకోవాలన్నారు. సమయానికి జీతం రాక, కుటుంబ ఇబ్బందులవల్ల మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య పాల్గొన్నారు.

## కోర్టు కేసులపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



నవతెలంగాణ-నస్పూర్

కోర్టు కేసులకు సంబంధించిన అంశాలపై అన్ని ఏరియాల పర్సనల్, లా విభాగ అధికారులతో డైరెక్టర్ ఫైనాన్స్, పా బలరాం, జనరల్ మేనేజర్ పర్సనల్ హనుమంతరావు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బలరాం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించిన అన్ని అంశాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయ స్థానంలో ఉన్న కేసులను సంబంధించి అన్ని వివరాలను సంస్థ తరపున న్యాయస్థానాలకు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(ప)అరవిందరావు, డీవైపీఎంలు రాజేశ్వరరావు, వి దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సంక్షేమ అధికారులు సునీల్, రణదీప్‌గౌడ్, గౌస్ పాషా, సంతన్, పాల్ సృజన్, అజ్మీర రమేష్, సీనియర్ లా ఆఫీసర్ ప్రబంధిత పాల్గొన్నారు.

## విద్యార్థులకు సర్వే డిపార్ట్‌మెంట్ చేయూత



నవతెలంగాణ - కాసిపేట

గని సర్వే డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో 'చేయూత' స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ఆర్థికంగా వెనుకబడిన గిరిజన ప్రాంతాల విద్యార్థులకు చేయూతనందిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని గుండ్ల పహాడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు, బట్టలను అందించారు. మౌళిక వసతులు కల్పించడం వల్ల పిల్లలు జ్ఞానవంతులై రేపటి సమాజాన్ని తీర్చబడేవారిగా తయారవుతారని ముఖ్య అతిథి సర్వేయర్ వెంకటేశ్వరరావు అన్నారు. సమాజానికి కొంత ఉపయోగపడడం వల్ల జీవితం ధన్యమవుతుందని జూనియర్ సర్వేయర్ ఖాన్ అన్నారు. సర్వే డిపార్ట్మెంట్ వారు పేబ్యాక్ చేయడం, విద్యార్థులకు జ్ఞానం అందించాలని చేయూత అందించడం అభినందనీయమని బన్న లక్ష్మణ్‌దాస్ అన్నారు. విద్యార్థులకు అండగా నిలవడం గొప్ప అనుభూతిని కలిగించిందని ఆడెపు రవి అన్నారు. ఈ కార్యక్రమంలో అంకం రాజమల్లు, మోహన్, ఆనంద్, గణేష్, ఆంజనేయులు, షకీల్, ప్రవీణ్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-హాజీపూర్

హాజీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మత్తుల కారణంగా టీకానపల్లి, దొనబండ, పెద్దంపేట్, బుద్ధిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, రాంపూర్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారుల సహకరించాలని కోరారు.

**వాంకిడి :** మండలంలో సబ్‌స్టేషన్ మరమ్మత్తుల దృష్ట్యా శనివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**కాసిపేట :** మండలంలోని కొండాపూర్ యానప సబ్‌స్టేషన్లో ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ స్వర్ణలత పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**భీమారం :** విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ఏఈ డి.కుమారస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మత్తులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి నెల రెండో శనివారంలో భాగంగా సబ్‌స్టేషన్ మరమ్మత్తులతో పాటు వివిధ ప్రాంతాల్లో 11కేవి విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

# దాడికి పాల్పడ్డ వ్యక్తిని వెంటనే శిక్షించాలి

నవతెలంగాణ-కోటపల్లి

షెట్‌పల్లి గ్రామంలో దళిత రైతు దుర్గం బాపుపై దాడి చేసిన రాంరెడ్డిని అరెస్ట్ చేసి శిక్షించాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు తుంగపిండి రమేష్ డిమాండ్ చేశాడు. శుక్రవారం బాపును పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత వ్యక్తులంటే అగ్రకులాల వాళ్లకు చిన్నచూపని, దీన్ని ఆసరా చేసుకొని దళిత రైతును పశువును బాదినట్టు బాది చెట్టుకు కట్టేశారని తెలిపారు. దళిత ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఇలా జరగడం సిగ్గుచేటని అన్నారు. దళిత రైతుపై దాడికి పాల్పడ్డ రాంరెడ్డిపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు. దళిత రైతుకు న్యాయం జరిగే వరకూ బీఎస్‌పీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.



పరామర్శిస్తున్న తుంగపండి రమేష్

**నేతకాని సంఘం ఆధ్వర్యంలో..**

ఎన్ని చట్టాలు వచ్చినా దళితులపై దాడులు ఆగడం లేదని రాష్ట్ర నేతకాని సంఘం అధ్యక్షులు దుర్గం రాజేష్ అన్నారు. శుక్రవారం దళిత రైతు బాపును ఇంటికెళ్లి పరామర్శించారు. దళితులపై ఇన్ని దాడిలు జరుగుతున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. దాడికి పాల్పడ్డ రాంరెడ్డిపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించాలన్నారు. ఆయన వెంట జనగామ తిరుపతి, ఏస్కురి రాజమల్లు, జాడి రాజేష్, భాస్కర్, సంపత్, వెంకటస్వామి పాల్గొన్నారు.



**జన్నారం :** దళిత రైతు దుర్గం బాపుపై దాడి చేసిన సూరం రామ్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలలో దళితులపై అగ్రవర్ణ కులాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వాలు స్పందించి దళితులపై దాడులను ఆపాలన్నారు. దుర్గం బాపుపై దాడి చేసిన రామ్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించి నివేదిక కోరాలని, బాధితునికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నేతకాని సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, మాల మహానాడు జిల్లా నాయకులు జక్కుల సురేష్, రాష్ట్ర నాయకులు కా మర వెంకటస్వామి, జాడి సుధాకర్ పాల్గొన్నారు.

# ఆజాది కా అమృత్ మహోత్సవ్ ముగింపు

నవతెలంగాణ-మందమర్రి

ఆజాది కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో శుక్రవారం ఆజాది కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మందమర్రి ఏరియా జీఎం జి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం సిద్ధించి 77 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ సిఅండ్ఎండి శ్రీధర్ ఆధ్వర్యంలో 77 వారాల పాటు పర్యావరణం, పారిశుధ్యం, మెడికల్ క్యాంపులు, పారిశుధ్య, పర్యావరణ అవగాహన సదస్సులు, విద్యార్థులకు ఆటల పోటీలు వ్యాసరచన, డ్రాయింగ్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గత సంవత్సరం పర్యావరణంపై చేసిన అనేక కార్యక్రమాలకు మందమర్రి ఏరియా రెండో బహుమతి సాధించిందని తెలిపారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర



సత్యనారాయణ, టీబీజీకేఎస్ నాయకులు సివి రమణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డివైపిఎం మైత్రేయ బంధు, డివైపిఎం సత్య బోస్, సంక్షేమాధికారి శ్రీనివాస్, అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే టిక్కెట్ స్థానికులకే కేటాయించాలి



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ ఎస్టీ నియోజకవర్గంలో అన్ని పార్టీలు స్థానికులకే టికెట్లు కేటాయించాలని కాంగ్రెస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు, జిల్లా పరిశ్రమల శాఖ రిటైర్డ్ మేనేజర్ జాదవ్ రామ్‌కిషన్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్థానికులకు టికెట్లు ఇస్తే గెలిచిన అభ్యర్థికి స్థానిక సమస్యలపై అవగాహన ఉంటుందన్నారు. అభివృద్ధి చేయడానికి వీలుంటుందని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. మండలంలోని కొత్తూరుపల్లె గ్రామ సమీపాన, మోర్రిగూడ వాగుపై బ్యారేజ్ నిర్మిస్తే ఆయకట్టు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఐటిఐ ఏర్పాటు చేయాలన్నారు, కలమడుగులో ఎస్సీ హాస్టల్ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాములు నాయక్, పున్నం నాయక్ పాల్గొన్నారు.

# బోదకాలు నివారణకు మందులు పంపిణీ

నవతెలంగాణ-కోటపల్లి

బోదకాల నివారణకు ప్రతి ఒక్కరూ మాత్రలు వేసుకోవాలని జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. గ్రామపంచాయతీలో శుక్రవారం ప్రజలకు మాత్రలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలన్నారు. ముందు జాగ్రత్తగా డీఈసీ, హైవేర్ మెడ్సిన్, ఆల్బెండజోల్ మాత్రలు మింగటం వల్ల ఈ వ్యాధి రాదన్నారు. ఈ మాత్రల పంపిణీ ఆగస్టు 26 వరకు ఉంటుందన్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఈ మాత్రలను ఇస్తారని తెలిపారు.

**జన్నారం :** ప్రతి ఒక్కరూ బోదకాల నివారణ టాబ్లెట్లు వేసుకోవాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో గ్రామస్తులకు బోదకాల నివారణ టాబ్లెట్లను వేశారు. ప్రతి ఒక్కరూ ఈ ట్యాబ్లెట్లు వేసుకొని బోదకాల వ్యాధి రాకుండా చూసుకోవాలన్నారు. కార్యదర్శి లావణ్య, అంగన్వాడీ టీచర్లు జాడి సంజీవరాణి, జమున, ఆశా రజిత పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్ :** జాతీయ నులిపురుగు నిర్మూలనలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగు నిర్మూలనకు మందులను ఆశా వర్కర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్, రాజ్యలక్ష్మి, ఆశా వర్కర్లు వెంకటలక్ష్మి, సునీత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** బోదకాలు మాత్రలు ప్రతి ఒక్కరూ తీసుకోవాలని జిల్లా డిప్యూటీ



ఆసిఫాబాద్



జన్నారం

వైద్యాధికారి సుధాకర్ నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని చైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్‌తో కలిసి మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోదకాల నివారణ కోసం మాస్ డ్రగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి ఒక్కరు మాత్రలు తీసుకోవాలని, అప్పుడే వ్యాధి పూర్తిస్థాయిలో నివారించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు సత్యనారాయణ, ప్రిన్సిపల్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది రాథోడ్ ఉత్తమ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**జన్నారం :** బోదకాల వ్యాధికి నియంత్రణ తప్ప నివారణ మార్గం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ నాగయ్య తెలిపారు. ఎండిఏ(మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని కిష్టాపూర్, కామన్‌పెల్లి, కవ్వాల్ గ్రామాలను అడిషనల్ డైరెక్టర్ నాగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోదకాల వ్యాధిని తరిమికొట్టడానికి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎండిఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఈ వ్యాధికి నియంత్రణే తప్ప నివారణ మార్గం లేదని అన్నారు. అందరూ తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలని తెలిపారు. బూత్ లెవెల్ కార్యక్రమంలో భాగంగా ఆశాలు, అంగన్వాడీలు, ఫైలేరియా మందుల పంపిణీని పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమాశ్రీ, సిహెచ్ఓ రమేష్, హెల్త్ ఎడ్యుకేషన్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ గుండేటి నామ్‌దేవ్, వైద్య సిబ్బంది రాంబాబు, కమలాకర్ పాల్గొన్నారు.

## విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలి : ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీసులు తమ విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో ఎస్సైగా పనిచేసే పదోన్నతి పొంది జిల్లాకు సీఐగా వచ్చిన సిహెచ్. ముత్యంరాజు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు సిసిఎస్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ విధుల్లో బాధ్యతగా వ్యవహరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. న్యాయం కోసం వచ్చే వారి పట్ల మర్యాదగా ప్రవర్తించి వారికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి అచ్చేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవనానికి స్థలం కేటాయించాలని వినతి



నవతెలంగాణ - కాసిపేట

సోమగూడెం భరత్ కాలనీ గ్రామ పంచాయతీలో ఐకేపీ మహిళా సమాఖ్య భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ సర్పంచ్ ప్రమీలాగౌడ్ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. జీఎంను కలిసి మహిళా సమాఖ్య తీర్మానంతో పాటు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం సోమగూడెం మహిళా సమాఖ్య భవనానికి నిధులు మంజూరు చేయగా సోమగూడెం సింగరేణి ప్రాంతం కావడంతో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలాగౌడ్, సోమగూడెం మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డును ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కోమటిగూడ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ విమలాబాయి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కోమటిగూడలో సీసీ రోడ్డు లేకపోవడంతో రూ.8లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డు, మురికి కాలువల పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పురుషోత్తం, బీఆర్ఎస్ నాయకులు దీపక్, వెంకటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'గృహలక్ష్మి' అర్హులకే అందజేయాలని వినతి



నవతెలంగాణ - కాసిపేట

అర్హులకు గృహలక్ష్మీ పథకం అందజేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ మాట్లాడుతూ దళితబంధు పథకాన్ని బీఆర్ఎస్ బంధు పథకంగా చేశారని, గృహలక్ష్మి పథకాన్ని అలా చేయకుండా పేదలకు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డు ఉన్న వల్లే అర్హులని నిబంధన పెట్టడం హాస్యాస్పదమన్నారు. గృహలక్ష్మి పథకంలో అక్రమాలు జరిగితే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నాయకులు రాజమౌళి, జాడి శివ, సల్లూరి సమీల్ కుమార్, దుర్గం ప్రవీణ్, బోర్లకుంట ప్రణయ్, జాడి మల్లేష్, పిడుగు మనోహర్, షారుఖ్, దీపక్ పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి సివిల్ సర్వీస్ క్రీడా పోటీలకు దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న వారికి రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని డివైఎస్ఓ రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పోటీలో భాగంగా అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, చెస్, క్యారం, ఫుట్ బాల్, హాకీ, కబడ్డీ, వాలీబాల్, లాండ్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు 8008090626, 9440010453 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## అక్రమ అరెస్టులకు ఖండన

నవతెలంగాణ-నస్పూర్

బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగ గర్జన కార్యక్రమం కొరకు కలెక్టరేట్‌కు వెళ్తున్న బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ కు తరలించడం దారుణమని, ఈ అక్రమ అరెస్టులపై బీజేవైఎం నస్పూర్ పట్టణ అధ్యక్షులు కొండ వెంకటేష్, దళిత మోర్చా పట్టణ అధ్యక్షులు సిరికొండ రాజు ఖండించారు. అణిచివేతలు, అక్రమ అరెస్టులతో బీజేవైఎం పోరాటాలను ఆపలేరని, నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం నస్పూర్ పట్టణ సెక్రటరీ చింతకింది రవి, బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి తరాల విజయ్ ఉన్నారు.

## పశుసంపదను పెంచాలి

నవతెలంగాణ-కడెం



పశుసంపదను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న అన్నారు. శుక్రవారం పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువుల్లో వచ్చే వ్యాధులపట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ పశువైద్యుల సేవలను వినియోగించుకొని పశు సంపదను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.విజయ్ కుమార్, పశువైద్య సిబ్బంది, వి.విజయ, జె.రాజేశ్వర్, బి. రమేష్, ఎస్.మదన్, జి.మల్లేష్, జి.రాము గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ సిబ్బంది అభిప్రాయ సేకరణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త సేకరణ, మురికి కాలువల పూడిక, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు తదితర వాటి గురించి అభిప్రాయాలను తీసుకున్నారు. అన్ని మున్సిపాలిటీల ర్యాంక్ తీసుకోవడానికి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది వెంకటేష్, శివప్రసాద్, నరేష్, ఎన్ఎస్ఎస్ అధికారి గాలి అశోక్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి సన్మానం



**నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్**

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి శుక్రవారం ఖానాపూర్ మండల న్యాయవాదులు సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం 41ఏ సీఆర్పీసీని రద్దు చేయాలని, దీనివల్ల నేరస్తులకు స్టేషన్ బెల్ లభించి, భయం లేకుండా ఉందని తెలిపారు. న్యాయవాదుల కోరిక మేరకు శాసన మండలిలో ఈ విషయంపై చర్చించే ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేష్, సభ్యులు కిషోర్ నాయక్, మహేంద్ర, ఆసీఫ్ అలీ, శివ, శేఖర్, షబ్బీర్ పాషా, వెంకటేశ్, కమలాకర్, వినయ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



**నవతెలంగాణ-ఖానాపూర్**

ఖానాపూర్ పట్టణంలో మొదటి వార్డు, రెండో వార్డు, మూడో వార్డులకు చెందిన ప్రజలు శుక్రవారం ఎమ్మెల్యే రేఖా నాయక్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలుపుతున్న సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని నేడు దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి పార్టీలో చేరుతున్నట్టు పలువురు తెలిపారు.

## వంతెన నిర్మాణానికి రూ.46కోట్లు మంజూరు

**నవతెలంగాణ-లోకేశ్వరం**

మండలంలోని హవర్గ గ్రామ సమీపంలోని అర్లి-లోకేశ్వరం వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముందు భాగం రేవిట్మెంట్ కూలిపోయింది. దీంతో బారీ వాహనాలు, బస్సుల రాకపోకలను నిలిపివేశారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి నివేదించారు. ఆర్థిక శాఖ అనుమతి లభించడంతో నూతన వంతెన నిర్మాణానికి రూ.46 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో టెండరు ప్రక్రియలు పూర్తి చేసి నిర్మాణం ప్రారంభిస్తామని అన్నారు.

## నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

నేడు జిల్లా కేంద్రంలోని భూక్తాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని భూక్తాపూర్, సినిమారోడ్, మోచిగల్లీ, ద్వారకానగర్, విద్యానగర్, ఏరియాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులందరూ ఈ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

**ఆదిలాబాద్‌రూరల్ :** నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆదిలాబాద్ మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్లలో నెలవారి మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ల పరిదిలోని వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని వేగవంతం చేయాలనీ, బాధితులకు సత్వర న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 30 కేసులు నమోదు కాగా, ఆదిలాబాద్ డివిజన్‌లో19, ఉట్నూర్‌లో 11 నమోదు అయి విచారణ దశలో ఉన్నాయని తెలిపారు. జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందని ఎస్పీ వివరించారు. అంతకుముందు కేసుల వారిగా సంబంధించిన అంశాలను పోలీస్, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్, ఎస్పీలు సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలదేవి, ఆర్డీఓలు స్రవంతి, ఎల్.జీవాకర్‌రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్, నాగేందర్, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు సునీతకుమారి, రాజలింగం, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శంకర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేశ్వర్, ఐటీడీఏ ఏఓ రాంబాబు పాల్గొన్నారు.

# యువతను మాదక ద్రవ్యాలకు బానిసలను చేస్తున్న ప్రభుత్వం



**నవతెలంగాణ-నిర్మల్**

యువతను మాదక ద్రవ్యాలకు బానిసలుగా ప్రభుత్వం చేస్తోందని బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. నిరుద్యోగులను, విద్యార్థులను మోసం చేస్తున్న రాష్ట్ర సర్కార్, ఎన్నికల హామీలో ఇచ్చిన రూ.3016 నిరుద్యోగ భృతి హామీకే పరిమితమైందని అన్నారు. 56 నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతి ఊసే లేదని అన్నారు. బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థులకు కనీసం తిండి కూడా పెట్టడం లేదన్నారు. విద్యార్థులను పొమ్మన లేక పొగ పెడుతున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక బాసర ట్రిపుల్ ఐటినీ, విద్యార్థులను ఎలా కాపాడుకోవాలో అలా కాపాడుకుంటామని అన్నారు. స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆగడాలకు హద్దూ అదుపు లేకుండా పోతుందని అన్నారు. ఇష్టా రాజ్యంగా మాస్టర్ ప్లాన్ పేరిట జోన్లు మార్చి వేల కోట్లు దండుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా యువ మోర్చా అధ్యక్షులు వొడిసెల అర్జున్, జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు రాంనాథ్, కుమ్మరి వెంకటేష్, అయ్యన్నగారి భూమయ్య, సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మ రాజు, కమల్ నయన్, భరత్, సాదం అరవింద్, నాయుడి మురళి, గిల్లి విజయ్, సాగర్, అల్లం భాస్కర్, తక్కల రమణరెడ్డి, సంతోష్, సరికెల గంగన్న, మార గంగారెడ్డి, మండల యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలి

●మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

బీసీ కులవృత్తిదారులు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పలువురు లబ్దిదారులకు లక్ష రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. కులవృత్తులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారికి అండగా నిలిచేలా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి అనేక బృహత్ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. సమగ్రాభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శైలజ, ఆర్ఐ వెంకటేష్, కౌన్సిలర్ పవన్ నాయక్ పాల్గొన్నారు.

## డీసీసీ నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం



**నవతెలంగాణ-దిలావర్‌పూర్**

నిర్మల్ డీసీసీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన కూచాడి శ్రీహరిరావుని ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ముథోల్ పార్టీ ఇన్‌చార్జి ఆనంద్‌రావు పటేల్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనను సరైన సమయంలో గుర్తించి, డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించి కొండంత బలాన్నిచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేసి నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఖచ్చితంగా గెలిపించి తీరుతామని తెలియజేశారు. కార్యక్రమంలో ముథోల్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నాకిడి నవీన్, మండల ఉపాధ్యక్షులు సయ్యద్ సలీం, నాయకులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన అదిలాబాద్ మండలంలోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. 44వ జాతీయ రహదారి చాంద(టి) శివారంలోని శ్రీనివాస్ దాబా వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి రహదారిపైన అటు ఇటు పోతుండగా వెనుక వైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

## ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించిన డీఎస్పీ



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని తన సొంత వాహనంలో ఎక్కించి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం విధుల్లో భాగంగా జిల్లా కేంద్రానికి వెళ్లిన ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తిరిగి ఉట్నూర్‌కి వస్తున్నారు. మండలంలోని శ్యాంపూర్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తు ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. ఈ సంఘటనను చూసిన ఉట్నూర్ డీఎస్పీ తన గన్‌మెన్ వినోద్, సిబ్బందితో తన సొంత వాహనంలో ఎక్కించుకుని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులకు సమాచారం అందించి, వైద్యం చేయించారు. ఆపదలో ఉన్నవారందరికీ సహాయం చేయాలని డీఎస్పీ సూచించారు. ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలించి, వైద్యం అందించడం పట్ల ఉట్నూర్ డీఎస్పీని పలువురు ప్రసంసంశలతో ముంచెత్తారు.

## పేదింటి ఆడబిడ్డలకు వరం కళ్యాణలక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేద ఆడపిల్లలకు కళ్యాణలక్ష్మి వరమని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. తిర్యాణి మండలంలోని లబ్దిదారులకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మీ పథకం పేదింటి ఆడ పిల్లలకు గొప్ప వరం లాంటిదని అన్నారు. పేద ఆడపిల్లలకు వివాహ సమయంలో తల్లిదండ్రులకు భారంగా భావించవద్దని తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించి అన్ని వర్గాల వారికి లక్ష నూట పదహారు ఇవ్వడం గొప్ప విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి చంద్రశేఖర్, ఎంపీపీ శ్రీదేవి, నాయకుడు జగదీష్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రీన్ సుల్తానా




నవతెలంగాణ-హాజీపూర్

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రీన్ సుల్తానా అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారంగ సమగ్రాభివృద్ధికి జీపుజాత కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం బెల్లంపల్లిలో జీపుజాత మొదలుకాగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో ముగింపు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందలేదని అన్నారు. నేటికి 9ఏండ్లు పూర్తి అయిన సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించలేదని పేర్కొన్నారు. మరొక పక్క ప్రభుత్వం విద్యను బలపేతం చేస్తామని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహిస్తుందో తెలుస్తోందని అన్నారు. మంచిర్యాల జిల్లాలో ఉన్నటువంటి హాస్టళ్లలో పరిస్థితి అధ్వానంగా దర్శనమిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలని సందర్శించడంతో అనేక విద్యారంగ సమస్యలు కనిపించాయని అన్నారు. మంచిర్యాల జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో పీజీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని అన్నారు. చెన్నూరులో ఎస్సీ గర్ల్స్ అండ్ బాయ్స్ కాలేజ్ హాస్టల్, ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాగం శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి దుండిగల అనిల్, జిల్లా కమిటీ సభ్యులు అభినవ్, సత్యనారాయణ, రాజు, దినేష్, నస్పూర్ మండల సహాయ కార్యదర్శి పల్లవేణి రాకేష్, బెల్లంపల్లి డివిజన్ నాయకులు, సాయి గణేష్, సంజయ్ పాల్గొన్నారు.

## కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని రాస్తారోకో

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ గ్రామపంచాయతీ పరిధిలో 25 మంది గ్రామపంచాయతీ కార్మికులు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మురళీ మాట్లాడుతూ గత 34 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారని అన్నారు. లేబర్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇచ్చి, సమ్మె చేసిన కార్మికులకు ప్రభుత్వంతోనే చర్చలు జరిపి 34 రోజులకు సమ్మె విరమించినా, గ్రామ పంచాయతీ కార్మికులను పంచాయతీ సెక్రటరీగాని, గ్రామ సర్పంచ్ కానీ విధుల్లోకి తీసుకోకుండా కార్మికులను ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. డీపీఓ, ఎంపీడీఓ చెప్పిన విధుల్లోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా



గ్రామపంచాయతీ కార్మికులను డీపీఓ, ఎంపీడీఓ ఆదేశాల మేరకు కార్మికులను పనిలో పెట్టుకోవాలని అన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గైని మురళీమోహన్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ముధోల్ మండల అధ్యక్షులు ఆకాష్, కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షులు రవి, రతన్, గంగాధర్, అనిల్ పాల్గొన్నారు.

## జీపీ కార్యదర్శులు మరింత బాధ్యతగా పనిచేయాలి

- జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవ లక్ష్మి
- రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు అందజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంచాయతీ కార్యదర్శులు మరింత బాధ్యతగా పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోవ లక్ష్మి సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ బోర్కడే హేమంత్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ ప్రదీప్ తివారితో కలిసి పంచాయతీ కార్యదర్శులకు రెగులరైజేషన్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రాష్ట్రం అవార్డు సాధించడానికి కార్యదర్శులు కారణమని ప్రభుత్వం గుర్తించి రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు నిబద్ధతతో పనిచేసే రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో మరింత గుర్తింపు ప్రభుత్వం వరంగా అందుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## టీలో మాత్రలు కలిపి హత్యాయత్నం

- అన్నదమ్ములే సూత్రదారులు

నవతెలంగాణ-సిరికొండ

బంగారం తవ్వడానికి అడ్డు వస్తున్నాడని టీలో మాత్రలు కలిపి హత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ సులేమాన్, షేక్ బిలాల్, అజ్గర్ తమ అన్న షేక్ ఆదామ్ చేనులో బంగారం ఉందని, దాన్ని తీయడానికి అన్నతో చెబితే ఒప్పుకోడని అడ్డు తొలగించాలని ప్రణాళిక వేశారు. మండల కేంద్రానికి చెందిన యువకుడు తాళ్ల రమేష్ విష మాత్రలు కలిపి అతన్ని చంపేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నట్టే ఆ యువకుడు ఈ నెల 5న శనివారం ఆవును అమ్ముతానని షేక్ ఆదామ్‌ను ఇంటికి రమ్మని పిలిచాడు. అతను ఇంటికి వెళ్లి ఆవును కొనుగోలు చేశాడు. అనంతరం చాయ్ తాగుదామని చెప్పి రెండు కప్పుల్లో చాయ్ తీసుకొని వచ్చాడు. ఒక కప్పులో నిండుగా, ఇంకో కప్పులో కొద్దిగా ఉండటంతో నిండుగా ఉన్న కప్పును ఆదామ్‌కి ఇచ్చాడు. కొద్దిగా ఉన్న కప్పును అతను తీసుకున్నాడు. కప్పు నిండుగా ఉండటంతో కొంత అతని కప్పులో పోశాడు. రమేష్ చాయ్ తాగకుండా పడేశాడు. అనుమానం వచ్చిన ఆదామ్ చాయ్ తాగలేదు. అనంతరం మంగళవారం ఉదయం మళ్లీ తన టైలర్‌షాప్‌లో కూడా అటువంటి ప్రయత్నమే చేశాడు. రమేష్ ఒక హోటల్ నుంచి చాయ్ తీసుకొని వచ్చి తాగుదామని చెప్పి అతనే తీసుకొచ్చాడు. చాయ్ కొంచెం వాసన రావడంతో తాగలేదు. మళ్లీ అదే రోజు సాయంత్రం సమయంలో ఆదామ్ చేనుకి వెళ్లి, టీ తాగుదామని రమేష్ చాయ్ తీసుకొని వెళ్లాడు. అనుమానం వచ్చి తనకెందుకు ఇన్ని సార్లు చాయ్ ఇస్తున్నావని అడగడంతో రమేష్ అసలు విషయం చెప్పాడు. మీ చేనులో బంగారం ఉందని, బంగారం తీయడానికి వెళితే నువ్వు అడ్డు వస్తావని, నీ అడ్డు తొలగించాలని మీ అన్నదమ్ములు చెప్పడంతో నిన్ను చంపే ప్రయత్నం చేశానని చెప్పాడు. దీంతో ఆదామ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చంపడానికి ప్రయత్నించిన షేక్ సులేమాన్, షేక్ బిలాల్, అజ్గర్, రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## రైల్వే గేటును పరిశీలించిన ఆర్డీఓ



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రం సమీపంలోని రైల్వే గేటును ఆర్డీఓ స్రవంతి శుక్రవారం పరిశీలించారు. రైల్వే గేట్ నుంచి 15 గ్రామాలు మండల కేంద్రానికి వివిధ పనులపై వస్తున్నందున ఇబ్బంది కలగకుండా రైల్వే అధికారులకు సూచించారు. అండర్ బ్రిడ్జ్ నిర్మించినపటికీ రైతులకు ప్రజలకు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా నిర్మించాలని రైల్వే శాఖ అధికారులను కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ స్రవంతిని తహసీల్దార్ రాజమోహన్‌ను, గ్రామ సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మెన్ ఆసం రవి, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## 13న పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాధికార సాధన కోసం ఈనెల 13న కోరుట్లలో నిర్వహించనున్న పద్మశాలి రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యుద్ధభేరి బహిరంగ సభ వాల్ పోస్టర్లను సంఘం సభ్యులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. పద్మశాలి జనాభా దామాషా ప్రకారం రాజకీయ పార్టీలు ఎన్నికలలో సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వివిధ శాఖల్లోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 13న హైదరాబాద్‌లో చేపట్టే ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తరలిరావాలని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని అన్నారు.

## ఆయుష్ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ముధోల్



ముధోల్ మండల కేంద్రంలో ఆయుష్ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముధోల్ సర్పంచ్ రాజేందర్, తెలంగాణ ఆయుష్ డైరెక్టర్ హరిచందనకు శుక్రవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అల్లోపతికి బదులుగా సహజవైద్యం ఆయుర్వేద, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ హోమియోపతి ద్వారా చికిత్స చేసే ఉద్దేశంతో ముధోల్ మండల కేంద్రంలో ఆయుష్ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఇక్కడి పేద ప్రజలకి ఉపయోగ పడుతుందని ఆయన పేర్కొన్నారు. అతి పురాతన విధానాలని పరిచయంతో ఆయుష్ గ్రామం దిశగా అడుగులు వేయుటకు సహాయం కోరుతూ తెలంగాణ ఆయుష్ డైరెక్టర్ సహకారించాలని కోరారు.

## బీసీల పట్ల వివక్ష సరికాదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చే లక్షలో వివక్ష ప్రదర్శించడం సరికాదని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోలెం వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలు ఆర్థికంగా అభివృద్ధి చెందకపోవడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఖరేనని అన్నారు. బీసీలకు రూ.లక్ష ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం దానిని కొన్ని కులాలకే పరిమితం చేసి వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఇచ్చే కొన్ని కులాలకు కూడా కఠినమైన నిబంధనలు పెట్టారని విమర్శించారు. దీనిని నిరసిస్తూ శనివారం అన్ని మండలకేంద్రాలలో నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.